# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నీటి భద్రతకు సమర్థ జల నిర్వహణ కీలకమైన అంశమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలోని ప్రతీ ప్రధాన జిల్లా కేంద్రానికి రింగ్ రోడ్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో ఉగాది నుంచి దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థ "మనమిత్ర" సేవలను అందుబాటులోకి తెచ్చామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

==========================

నీటి భద్రతకు సమర్థ నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన జిల్లాల కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సమావేశంలో పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నీటి భద్రత కోసం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

తెలంగాణలోని ప్రతీ ప్రధాన జిల్లా కేంద్రానికి ఒక వలయ రహదారి - రింగ్ రోడ్ ను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రహదారులు, భవనాల శాఖపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కేంద్రాల వలయ రహదారులను జాతీయ రహదారులకు అనుసంధానించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో

రహదారుల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఉగాది నుంచి దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. వైకల్యం ఉన్నవారు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ వంటి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థ "మనమిత్ర" సేవలను అందుబాటులోకి తెచ్చామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఢిల్లీలో మెటా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "వాట్సాప్ సిటిజన్ ఎంగేజ్మెంట్ అండ్ ఇన్నోవేషన్" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఏడాది ఫిబ్రవరిలో 160 సేవలతో ప్రారంభమైన మనమిత్ర ఇప్పుడు 900 కు పైగా పౌర సేవలను అందిస్తోందని తెలిపారు. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రజల సమయం, శ్రమ ఆదా అవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో వంట గ్యాస్ సిలిండర్ల వార్తలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ హెచ్చరించారు. తక్షణ గ్యాస్ సిలిండర్ డెలివరీ, అదనపు సిలిండర్లు ఇస్తామని సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రకటనలు ఇస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింకులు పంపించి ముందుగా నగదు చెల్లించమని మోసం చేస్తున్నారని చెప్పారు. గ్యాస్ బుకింగ్ కోసం కంపెనీల అధికారిక వెబ్‌సైట్లు లేదా అధీకృత ఏజెన్సీలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబరుకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మృతి చెందిన వారు లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఫించన్లను మాత్రమే రద్దు చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారికి ప్రతి నెలా స్పౌజ్ కోటాలో వితంతువులకు కొత్తగా ఫించన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. సామాజిక భద్రతా ఫించన్ల కోసం 2026--27 ఆర్థిక సంవత్సరంలో 27 వేల 719 కోట్ల రూపాయలను బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లు తెలిపారు. ఫించన్ల పంపిణీకి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందేలా చర్యలు చేపట్టామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

---------------------------

మహిళల సమస్యల పరిష్కారానికి "జన్ సున్వాయ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మహిళ కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అన్నారు.విజయవాడలోని సమగ్ర రైతు శిక్షణ కేంద్రంలో ఎన్టీఆర్, కృష్ణా,

ఏలూరు నుంచి వచ్చిన మహిళల ఫిర్యాదుల విచారణతో పాటు కొత్త ఫిర్యాదులను స్వీకరించి నిన్న విచారించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో మహిళా 'జన్ సున్వాయ్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా శైలజ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఉప్పు తయారీపై బ్రిటీష్ ప్రభుత్వం పన్ను విధించటాన్ని నిరసిస్తూ జాతిపిత మహాత్మాగాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహానికి ఈ రోజుతో 96 ఏళ్ళు పూర్తయ్యాయి. ఉప్పు సత్యాగ్రహాన్ని దండి మార్చ్ అని కూడా పిలుస్తారు. 1930 మార్చి 12న గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతీ ఆశ్రమం నుండి అహ్మదాబాద్ లోని దండీ గ్రామం వరకు ఈ ఉప్పు సత్యాగ్రహ ర్యాలీ సాగింది. 80 మందితో ప్రారంభమైన దండి మార్చ్ లో ముగింపు సమయానికి 5 వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం దేశవ్యాప్త శాసనోల్లంఘన ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది. ఈ సత్యాగ్రహం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోయింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వేసవి రాకతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలులో నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 37.7 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న మూడు రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణాలోనూ ఎండల తీవ్రత పెరుగుతోంది. నిజామాబాద్‌లో 38.8 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జన గణన--2027 మొదటి దశకు సంబంధించిన మాస్టర్ ట్రైనర్ శిక్షణ కార్యక్రమం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీహెచ్ఆర్‌డీఐలో నిన్న ప్రారంభమైంది. ఇళ్ళ జాబితా గణనకు సంబంధించిన ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర జన గణన సంచాలకులు జె. నివాస్ ప్రారంభించి మాట్లాడుతూ, కచ్చితమైన జనాభా గణాంకాలు సేకరించేందుకు మాస్టర్ ట్రైనర్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా గణన ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో కృత్రిమ మేధ-ఏఐ సాంకేతికతను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మహారాష్ట్రలోని ముంబయిలో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో "కల్చరల్ ఏఐ" ఆధారిత పర్యాటక వ్యవస్థ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ "కల్చరల్ ఏఐ" ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని దేవాలయాలు, చారిత్రక వారసత్వ కట్టడాలు, సాంస్కృతిక గాథలను ఆధునిక సాంకేతికతతో పర్యాటకులకు డిజిటల్ అనుభూతి అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

=====================